

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## కరుణ

**వికాస్ మౌనంగా కారు నడుపుతున్నాడు**. పక్కనే కూర్చున్న నవ్య అతనివైపు ఓరగా చూసింది. అతని మొహంలో వత్తిడి, బాధ. స్టీరింగ్ మీది అతని చేతి మీద చెయ్యివేసి మృదువుగా చెప్పింది.

"నీకు బాధగా ఉంటుందని నాకు తెలుసు విక్కి. కానీ నా గురించి కూడా నువ్వు ఆలోచించాలి. ఇరవై ఎనిమిదేళ్ళ అమ్మాయికి ఎన్ని కోరికలు ఉంటాయి? నేను మరీ అంత చెడ్డగా ఏమీ ఆలోచించలేదేమో!"

"కానీ మా అమ్మ గురించి కూడా నువ్వుఆలోచించాలి కదా? నా పెళ్ళయ్యాక వచ్చి నా దగ్గరే ఉంటానని చెప్పింది" వికాస్ దిగులుగా అడిగాడు.

"మీ అమ్మేకాదు. మా అమ్మా నాన్నల గురించి కూడా ఆలోచించేది లేదు. పెళ్ళయ్యాక ఇంట్లో మనిద్దరమే ఉండాలి. మీ అమ్మకాని, నా పేరెంట్స్ కాని మనతో ఉండటానికి నేను ఒప్పుకోను. ఆ విషయంలో నేను క్లియర్‌గా ఉన్నాను" నవ్య ధృఢంగా చెప్పింది.

"మీ అమ్మానాన్న ఒకరికొకరు ఉన్నారు. కానీ మా అమ్మ... తను నాతో ఉండాలని ఎంత కోరుకుంటోందో తెలుసా? జీవితమంతా వంటరితనం అమ్మకి" అతని కంఠం వణికింది.

"ప్లీజ్. నువ్వు ఒప్పుకున్నావు. మళ్ళీ ఈ విషయం మీద వాదనలువద్దు. పెళ్ళయ్యాక నాకు ఏకాంతం కావాలి. వంటింట్లోని నేను నీకో, స్నానం చేసి వచ్చిన నువ్వు నాకో రొమాంటిక్‌గా కనిపించాం అనుకో వెంటనే కౌగలించుకుని ముద్దు పెట్టుకోవాలనిపిస్తుంది .పక్కన మీ అమ్మో, మా నాన్నో ఉంటే మనం ఆ పని చేయగలమా? ఇద్దరం కలిసి వంట

చేసుకోవడం, డైనింగ్ టేబుల్ సర్దుకోవడం, నీ ఒళ్ళో కాళ్ళు పెట్టి పడుకుని టి.వి చూడడం, పడకగదిలో స్వేచ్ఛగా, పెద్దగా నవ్వడం.. పెద్దవాళ్ళుంటే ఏదీ స్వతంత్రంగా చేయలేం. వాళ్ళు ఎక్కడ చూస్తారో, ఏం వింటారో అని బెరుగ్గా ఉంటుంది. అది మన సామ్రాజ్యం. ఎవరికీ అనుమతి లేదు."

"పోనీ రెండు మూడేళ్ళ తర్వాత?" ఆశగా అడిగాడు.

"నో.. నాకోరికలు కొంతకాలంలో పోయేవి కావు. అవి ఊరుతూనే ఉంటాయి. కావాలంటే వారానికో పదిరోజులకో వెళ్ళి చూసొద్దాం. ఆర్థికసాయం చేద్దాం. అంతే. మా అమ్మ అర్థం చేసుకుంది. మీ అమ్మకూడా చేసుకుంటుంది. నాకు తెలుసు. ఆడవాళ్ళంతా ఒకేలా ఆలోచిస్తారు" నవ్య నమ్మకంగా చెప్పింది.

వికాస్ మాట్లాడలేదు. ఇద్దరు ప్రియమైన వ్యక్తుల మధ్య అతను మానసికంగా నలిగిపోతున్నాడు.

కారు హైవేలోంచి పక్కకి మళ్ళింది. ఎదురుగా వాహనాలు వస్తూండటంతో నవ్య అతన్ని డిస్టర్బ్ చేయకుండా కారు కిటికీలోంచి బయటకి చూడసాగింది. ఆమెకి వికాస్ తల్లి ఏమంటుందో అనే అనుమానం ఉంది. 'పెళ్ళికి ముందే, కాబోయే కోడలు 'మీరు మాతో ఉండకూడదు ' అని చెపితే ఏ అత్తగారైనా ఒప్పుకుంటారా?' అనుకుంది.

'తను నెమ్మదిగా, లౌక్యంగా ఒప్పించాలి. ముప్పై రెండు మంది తనకి రిపోర్ట్ చేస్తారు. ఒక్క మనిషిని తను మేనేజ్ చేయలేదా?' ఆమె ఆత్మవిశ్వాసంతో అనుకుంది.

కారు ఓ గ్రామంలోకి ప్రవేశించింది. ఊరంతా దుమ్ము. ఇళ్ళ మధ్య తుప్పలు, కంచెలు. వీధుల్లో ఎవరూ కనిపించలేదు. 'ఇలాంటి ఊళ్ళో పెరిగిన వికాస్ అంత బాగా చదువుకుని పైకొచ్చాడంటే గ్రేట్ ' అనుకుంది.

రెండు మూడు వీధులు దాటాక ఓ చిన్న పెంకుటింటి ముందు కారు ఆపాడు. ఇంటిముందు ముగ్గేసి ఉంది. కారు ఆగిన శబ్దానికి తలుపు తెరుచుకుని ఒకావిడ బయటకి వచ్చింది.

వికాస్ ఆమె దగ్గరకి వెళ్ళి చెయ్యిపట్టుకున్నాడు. ఆవిడ అతని తలని వంచి నుదుటి మీద ముద్దు పెట్టుకుని అడిగింది.

"బాగుండావాయ్యా."

"అమ్మా నవ్య" వికాస్ పరిచయం చేసాడు.

"హలో ఆంటీ" నవ్య నవ్వింది.

ఆమె నవ్యని చూసి ఆశ్చర్యంగా చెప్పింది.

"అబ్బో ఎంత చక్కగా వున్నావో. రారా లోపలికి వెళ్దాం."

లోపల రెండు గదులు వంటగది. ముందు చిన్న పంచ ఉన్నాయి.

ఇల్లు శుభ్రంగా ఉంది కాని ఒక గదిలో వడ్ల బస్తాలు, ఇంకా ఏవో వ్యవసాయ పనిముట్లు ఉన్నాయి. హాల్లో నవ్వారు మంచం వేసి ఉంది.

ఆవిడ హడావిడి పడుతూ రెండు గ్లాసుల్లో మంచి నీళ్ళు తెచ్చిచ్చి చెప్పింది.

"వంటయిపోయింది. ఎప్పుడంటే అప్పుడు పెట్టేస్తా."

"తిందాం లేమ్మా. రా కుర్చో" వికాస్ తల్లి చెయ్యి పట్టుకుని లాగి మంచం మీద తన పక్కన కూర్చోపెట్టుకున్నాడు.

నవ్య ఆవిడని సంభ్రమంగా చూస్తూండిపోయింది.

కొంచెం మొరటుగా ఉన్నా చిన్న వయసని తెలిసిపోతుంది. పొట్టిగా సన్నగా రాగి రంగులో ఉంది. జడ నడుం దాటింది. కాటన్ చీరని కట్టుకుంది. మొహాన చిన్న నల్లబొట్టు. వికాస్ పోలికలు కనిపిస్తున్నాయి కాని వికాస్ పక్కన పిట్టలా ఉంది. తనతో మామూలుగా మాట్లాడుతున్నా, కొడుకుతో మాత్రం కొద్దిగా మోటు భాషలో మాట్లాడుతోంది. 'నేటివిటీ' అనుకుంది.

"ఆంటీ మీరు కూడా బాగున్నారు" చెప్పింది.

ఆవిడ మొహం వికసించింది.

"అందుకేగా మా వాడిని ప్రేమించావ్. వీడిది నా పోలికే. కాకపోతే ఒడ్డూ పొడుగూ వాళ్ళ నాన్నవి" మురిపెంగా చెప్పింది.

"అమ్మా. దారిలో హోటల్‌లో టిఫిన్ తిని వచ్చాం. కొద్దిసేపాగి అన్నం తిందాం. నేను ఊళ్ళోకి వెళ్ళి నా ఫ్రెండ్స్‌ని కలిసి వస్తా. నవ్యా అమ్మతో మాట్లాడుతూండు" వికాస్ లేచి వెళ్ళిపోయాడు.

ఆవిడ సంబరంగా నవ్య దగ్గరకి జరిగి ఆమె చేతిని పట్టుకుని చెప్పింది.

"ఎంత నాజూగ్గా ఉన్నావో. వికాస్ మంచివాడు. వాడిని బాగా చూసుకో. నువ్వు బాగా చదువుకున్నావని, పెద్ద ఉద్యోగమని, తెలివిగలదానివని చెప్పాడు. నేను నీకు చెప్పక్కర్లేదు."

"మీ గురించి చెప్పండి" నవ్య అడిగింది.

"వాడు చెప్పలేదా?"

"లేదు. అమ్మంటే ప్రాణం అని మాత్రమే చెప్పాడు."

ఆవిడ నవ్వింది.

"నా పేరు నాగలక్ష్మి. మా నాన్నా, మామగారు స్నేహితులు. ఓసారి మా నాన్న ఆయనకి కొంత డబ్బు అప్పిచ్చాడు. కొన్నాళ్ళ తర్వాత మామగారి దగ్గర రూపాయి లేనపుడు వెళ్ళి 'నా బాకీ తీరుస్తావా? మా అమ్మాయిని కోడలుగా తెచ్చుకుంటావా ' అని అడిగాడు. మా ఆయన.." ఆవిడ సిగ్గుగా ఆగింది.

నవ్యకి ఆమె మొహంలోని సిగ్గు తమాషాగా అనిపించింది.

"తను నాకంటే మూడేళ్ళే పెద్ద. మా ఇంటికి వచ్చినప్పుడల్లా నన్ను 'పొట్టీ' అని ఆట పట్టించేవాడు. తన పేరు రాంబాబు. మా నాన్న మాటలు విన్న రాంబాబు 'మావాఁ నువ్వు ఆ మాట మీదుంటే, నా దగ్గర డబ్బున్నా నీ బాకీ తీర్చను' అన్నాడంట. దాంతో మా నాన్న మురిసిపోయి మా పెళ్ళి చేసేసాడు. ఊళ్ళో వాళ్ళంతా 'ఆస్తిలేని వాడికి పిల్ల నిచ్చావ'ని మా నాన్నని పోట్లాడారు. 'ఆస్తి లేకపోయినా పిల్లని పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు' అని నాన్న సర్ది చెప్పాడు."

"అంకుల్ ఏమి చేసేవారు?" నవ్య ఆసక్తిగా అడిగింది.

"చేయడానికి మాకు పెద్ద చదువులు లేవు. ఇద్దరం టెంత్ చదివాం. తను ఫెయిల్. నేను పాస్" నాగలక్ష్మి నవ్వింది.

"మరి?""

"వ్యవసాయపు పనులే. నేను ఇంట్లోనే ఉండేదాన్ని. తను కష్టపడేవాడు. కానీ అమ్మాయ్ సీతారాములు వనవాసంలో ఉన్నప్పుడు ఎప్పుడూ కబుర్లు చెప్పుకుంటూండేవాళ్ళంట. సీతమ్మ, 'రాచనగరులో కంటే అడవిలోనే ముద్దు ముచ్చట్లు తీరుతున్నాయి ఇదే బాగుంది ' అనుకునేదంట. అట్లాగే పగలంతా పొలం పనులు చేసినా రాత్రంతా కబుర్లు చెప్పుకునే వాళ్ళం" ఆవిడ మళ్ళీ సిగ్గుపడింది.

నవ్యకి ఆ సిగ్గు అలవాటైపోయింది.

"పెళ్ళినాటికి నాకు పదహారు. రాంబాబుకి పంతొమ్మిది. నాకు పద్దెనిమిది రాగానే వికాస్ కడుపులో పడ్డాడు."

"అంత చిన్నప్పుడు?"

"1997లో కూడా అది చాలా చిన్నప్పుడే. డాక్టర్ మా ఆయన్ని బాగా తిట్టింది. 'ఇంత పొట్టిగా చిన్నగా ఉన్న పిల్ల ఎట్లా కంటుంది? బుద్ధిలేదా?' అని అడిగింది. మేమిద్దరం బిక్కమొహం వేసి మాట్లాడకుండా కూర్చుంటే, 'సరేలే, మందులు రాసిస్తా' అని జాగ్రత్తగా చూసుకుంది."

"వికాస్‌కి, మీకు పంతొమ్మిదేళ్ళు తేడా, అంటే మీకు నలభై ఏడేళ్ళే" నవ్య సంభ్రమంగా చెప్పింది.

"అవును. వీడు పుట్టిన రెండు రోజులకి ముందే నా పుట్టిన రోజు. మా రాంబాబు కొడుకుని చూసి ఎంత సంతోషించాడో. వాడికి వివేక్ అని పేరు పెట్టాం. మా టెన్త్ క్లాస్‌లో వివేకానందుడు పాఠం నాన్‌డిటెయిల్డ్‌లో ఉండేది. కొడుకు ఆయనంతటి వాడవ్వాలని మా కోరిక."

"మరి వికాస్?"

"వాడిని బళ్ళో చేర్పించినప్పుడు ఆ క్లాస్‌లో ఇంకో వివేక్ ఉండేవాడు. మాస్టారు నన్ను పిలిచి ఇద్దరు వివేకులుంటే గందరగోళం. వాడంటే సి. వివేక్, వీడు ఏ.వివేక్. పెద్దయ్యాక అందరూ అవివేక్ అంటారు. అందుకని వీడి పేరుని వికాస్ అని పెడతా అన్నాడు."

"మరి అంకుల్ ఒప్పుకున్నారా?"

నాగలక్ష్మి విషాదంగా నవ్వింది.

"రాంబాబుకి అంత అదృష్టమా? పొత్తిళ్ళల్లో కొడుకునేగా చూసింది? పిల్లాడికి ఆరోనెలప్పుడు పెద్ద వాన కురిసింది. తోట ఎట్లా ఉందో అని తెల్లారి పొద్దున్నే వెళ్ళాడు. గాలి వానకి కరెంట్ స్థంభాలు వంగిపొయి, తీగలు తెగి కింద పడినై. రాంబాబు చూడక కాలేసి షాక్ కొట్టి..."

"మై గాడ్!" నవ్య అదిరి పడింది.

వికాస్ తనకి తండ్రి లేడంటే, ఈ మధ్యే పోయాడనుకుంది కాని ఇది ఆమె ఊహించలేదు. అతని మీద తప్ప అతని కుటుంబం మీద ఆమెకి ఆసక్తి లేదు.

"ఆస్తిలేనివాడికి ఇస్తున్నాననుకున్నా కాని ఆయుష్షు లేనివాడికి ఇచ్చానమ్మా" అని మా నాన్న ఏడ్చాడు. ఆ దుఃఖంతో ఆయనకూడా ఏడాదిలో పోయాడు. నేను పసి గుడ్డు మిగిలాం. గడపదాటనిదాన్ని. ఏం చేయాలి? మెల్లిగా పొలం పనులకి వెళ్ళడం మొదలెట్టా. తప్పలా. మొన్న మొన్నటిదాకా అవే పనులు చేసా. నా కొడుక్కి ఉద్యోగం వచ్చాక, ఒట్టు పెట్టి పనులు మానిపించాడు. ఇప్పుడు ఇంట్లోనే ఉంటున్నా. మంచి ఇల్లు కట్టిస్తానన్నాడు కాని వద్దన్నా. నా తర్వాత ఎవరుంటారు ఇక్కడ, తన దగ్గరకి రమ్మన్నాడు. పెళ్ళయ్యాక వస్తానని చెప్పా."

"పొలం పనులతోనే వికాస్‌ని చదివించారా?"

"వాడు మాలాంటి మోటు పనులు చేయకూడదని మా ఆయన చావు చూడగానే అనుకున్నా. కాళ్ళకి చెప్పులు కూడా లేకుండా బురదలో తిరిగే పేదరికం మాతోనే పోవాలి. అదే వాడికి నూరిపోసా. కష్టపడ్డా. వాడూ కూడా బుద్ధిమంతుడు, తెలివైన వాడు కాబట్టి పైకొచ్చాడు. శుద్ధ మొద్దయితే నేనేం చేయగలిగేదాన్ని" నవ్వింది.

నవ్యకి బాధగా ఉంది. పంతొమ్మిదేళ్ళకే వైధవ్యం. వంటరి బతుకు. ఆవిడ కలలు, కోరికలు అన్నీ ఇరవైలోగానే బూడిదైపోయాయి.

"వాడు నా బెస్ట్ ఫ్రెండ్. ఇద్దరం ఎన్ని కబుర్లు చెప్పుకుంటామో. 'నీకు లోకం తెలీదమ్మా' అంటాడు. నాకు లోకమంతా వాడే. ఇంకే లోకం తెలియాలి?" నాగలక్ష్మి పైట చెంగుతో కళ్ళు తుడుచుకుంది.

"అదుగోవాడు వచ్చేసాడు. పదండి అన్నాలు పెడుతా" ఆవిడ పంపు దగ్గర చేతులు కడుక్కుని వంట గదిలోకి వెళ్ళింది.

"అదేంటి మూడీగా ఉన్నావు. అమ్మ నిన్నేమైనా అందా?" వికాస్ అడిగాడు.

"లేదు. ఆలోచిస్తున్నా" నవ్య దిగులుగా నవ్వింది.

ముగ్గురు డైనింగ్ టేబుల్ మీద కూర్చున్నారు. నాగలక్ష్మి వాళ్ళిద్దరికీ అన్నం వడ్డించి, తన కంచంలో గోధుమరవ్వతో వండిన అన్నాన్ని వడ్డించుకుంది.

"అదేంటి? డైటింగా?" నవ్య అడిగింది.

"అదో కథ" వికాస్ చెప్పాడు.

"చెప్పండి ఆంటీ" నవ్య కోరింది.

"వికాస్ ఆరో తరగతిలో ఉన్నప్పుడు వాడికి ఎంత పెద్ద జ్వరం వచ్చిందంటే, డాక్టర్లు గేరంటీ చెప్పలేమన్నారు. బతికినా చెవుడులాంటి ఏదో లోపంతో బతుకుతాడు అన్నారు. నా గుండెలు అవిసిపోయాయి. ఏం జబ్బురా అయ్యా అది? ఆవిడ కొడుకుని అడిగింది.

టైఫాయిడ్."

"ఆ అదే. అప్పుడు మా పక్కింటావిడ ఏం చెప్పిందంటే, 'ఒక ఇష్టమైంది దక్కాలంటే, ఇష్టమైన ఇంకోదాన్ని వదిలేయాలి. నీకు ఏది ఇష్టమో అది వదిలెయ్ నాగా' అంది. ఆ శోకంలోనే నాకేది ఇష్టమో అని ఆలోచించా. రాంబాబు ఇష్టం. పోయాడు. వికాస్ ఇష్టం. చావు బతుకుల్లో ఉన్నాడు. మనుషులు కాక నాకేది ఇష్టమంటే... అన్నం. నాకు అన్నం అంటే అమిత ఇష్టం. ఒక్కపూట తినకపోయినా రెండోపూటకి ఆవురావురుమంటూ తింటా. దాంతో దేవుడికి మొక్కుకున్నా 'దేవుడా! మావాడిని సక్రమంగా బతికించు. నేను జీవితంలో అన్నం తినను. అసలు వరిపిండితో చేసినవి కూడా తినను' వాడు బతికాడు, చెవుడులాంటి లోపాలు కూడా లేవు .అంతా దేవుడి దయ. ఆ తర్వాత అన్నం తినలేదు.

వీడు మారాం చేసేవాడు 'నువ్వు తినకపోతే నేను తినను ' అనేవాడు. 'దేవుడికిచ్చిన మాటరా అయ్యా ' అని బతిమాలేదాన్ని"

నవ్య కదిలిపోయింది. లేచి నాగలక్ష్మిని గట్టిగా ఆలింగనం చేసుకుని చెప్పింది.

"ఎన్ని బాధలు పడ్డారు ఆంటీ. మా పెళ్ళయ్యాక మీరు అప్పుడప్పుడూ మా ఇంటికి వచ్చి వారం పదిరోజులు ఉండి వెళ్ళండి."

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments